
సాక్షి ఒడిశా

మంగళవారం | 23 | ఏప్రిల్ | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,59,120లు, వెండి 6 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

బీజేడీ ఏడో జాబితా విడుదల

త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు బీజేడీ అభ్యర్థుల 7వ జాబితాను సీఎం నవీన్ పట్నాయక్ సోమవారం విడుదల చేశారు.

- 8లో.



నేటితో ముగియనున్న చైత్రోత్సవాలు

రాయగడ మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి.

- 8లో.

న్యూస్‌రీల్

కింగ్ కోబ్రా కలకలం



పట్టుబడిన కింగ్ కోబ్రా

బరంపురం: గంజాం జిల్లా పత్రపూర్ దగ్గర కిందురబడి గ్రామంలో 10 అడుగుల కింగ్ కోబ్రా సోమవారం కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ చాకచక్యంతో 10 అడుగుల కింగ్ కోబ్రాని పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

బరంపురం: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని బరంపురం ఎమ్మెల్యే రమేష్ చంద్రచౌ పట్నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక కొమ్మపల్లిలోని జిల్లా బీజేడీ కార్యాలయంలో రక్తదాన శిబిరం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమయాల్లో దుర్ఘటనల్లో సకాలంలో రక్తం అందక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు సేకరించాలని చెప్పారు. శిబిరంలో నగర మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు పాల్గొన్నారు.

మునిగుడలో గంజాయి స్వాధీనం



గంజాయితో పోలీసులకు దొరికిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ ఆటో స్టాండ్ వద్ద 48 కిలోల గంజాయిని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపిన జిల్లా యంత్రాంగం విస్తృతంగా నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా సోమవారం అనుమానాస్పదంగా గుర్తించిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనున్న బ్యాగులను తనిఖీలు చేయగా గంజాయి బయటపడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జయపురం బీజేపీ అభ్యర్థిగా గౌతమ్



జయపురం: జయపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌతమ్ సామంతరాయ్‌ని బీజేపీ అధిష్ఠానం ఎట్టకేలకు ప్రకటించింది. టిక్కెట్టు కోసం హిమాంశు మహాపాత్రో, ఆర్ఎస్ఎస్ నేత సుదాంసు శేఖర జెనలు సైతం ప్రయత్నించారు. దీంతో హిమాంశు మహాపాత్రోకు గౌతమ సామంతరాయ్ మధ్య దూరం పెరిగింది. అయితే ఎట్టకేలకు గౌతమ్‌కు టిక్కెట్టు వరించింది. గౌతమ్ సామంతరాయ్ 2014, 2019 ఎన్నికల్లో జయపురం నియోజకవర్గంలో పోటీ చేశారు. 2014లో ఆయన ఓజేఎం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికలో 1 శాతం ఓట్లు పొంది 6వ స్థానంలో నిలిచారు. అనంతరం అతడు బీజేపీలో చేరి 2019లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికలో గౌతమ సామంతరాయ్ 3 స్థానంలో నిలిచి తన ఓట్ల శాతాన్ని పెంచుకున్నారు. ఆ ఎన్నికలో 21 శాతం ఓట్లు అంటే 33,805 ఓట్లు పొందారు. అయితే ప్రస్తుతం పార్టీ తరుపున టిక్కెట్టు దొరకని అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీచేసే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

బరంపురం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి సుమారు 2,000 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. గంజా జిల్లాలోని పత్రపూర్ బ్లాక్ ఆంధ్ర–ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో అక్రమంగా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. నాటుసారాతో పాటు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.



కొరాపుట్: నామినేషన్ దాఖలు చేస్తున్న నబరంగ్‌పూర్ బీజేడీ లోక్‌సభ అభ్యర్థి ప్రదీప్ మజ్జి



రాయగడ: కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న అప్పలస్వామి కద్రక



రాయగడ: గుణుపూర్‌లో సీపీఐ (ఎంఎల్) అభ్యర్థి అనాసిన్ సాబొరాతో మద్దతుదారులు



బరంపురం: దిగపండి స్థానానికి నామినేషన్ వేస్తున్న బిప్లవ పాత్రో



మల్కన్‌గిరి: నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి నరసింగ మద్కమి

నామినేషన్ల జోరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాలుగో విడత నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి



కొరాపుట్: నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్తున్న పాట్టంగి బీజేడీ అభ్యర్థి ప్రఫుల్ల పంగి



రాయగడ: నామినేషన్ వేసేందుకు వెళ్తున్న నవ భారత నిర్మాణ సేవా సమితి అభ్యర్థి చిన్నమ్మలు



జయపురం: నామినేషన్ వేసిన ఆల్ ఇండియా హిందూ మహాసంఘ్ అభ్యర్థి మహేంద్ర కుమార్ పాత్రో



జయపురం: నామినేషన్ వేస్తున్న కోట్‌పాడ్ బీజేడీ అభ్యర్థి చంద్రశేఖర మఝి



పర్లాకిమిడి: బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: మోహనా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి దండాసీ ఖందోవాల్ నామినేషన్

సైకిల్ ర్యాలీతో ఓటుహక్కుపై అవగాహన



జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లా ఎన్నికల కార్యాలయం సూచన మేరకు జయపురం మున్సిపాలిటీలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం ఆదివారం చేపట్టారు. స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయ క్రీడా మైదానం నుంచి ఉదయం 6 గంటల సమయంలో ప్రారంభించిన సైకిల్ ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు. ఓటు విలువ, ఓటు ఎందుకు వేయాలి అనే విషయాలపై ప్లకార్డులు సైకిళ్లకు కట్టి జయపురం పుర వీధుల్లో భారీర్యాలీ నిర్వహించారు. డబ్బు ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జయపురం సోషియల్ ఎడ్యుకేషనల్, ఎన్విరాన్ మెంటల్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీవా) సభ్యులు, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, బీడీవో శక్తి మహంతి, సబ్ కలెక్టర్ రాజేంద్ర కుమార్ పరిడ, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత శర్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భద్రత కట్టుదిట్టం



చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన పోలీసులు

బరంపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న తరుణంలో గంజాం జిల్లా, పుల్బాణి సరిహద్దు 59వ జాతీయ రహదారిలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. గంజాం జిల్లా బంజనగర్ నుంచి కొందమాల్ జిల్లా పుల్బాణికి వెళ్లే సరిహద్దు బొక్కపద జంక్షన్‌లో గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా ఆదేశంతో బెటాలియన్ పోలీసుల బృందం పూర్తి నిఘా ఉంచి అర్ధరాత్రి వరకు వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. అనుమానం గల వాహనాలను పోలీసుస్టేషన్‌కి తరలిస్తున్నారు. అదేవిధంగా వారంట్ ఉన్నవారిని అరెస్టు చేసి జైలుకి తరలిస్తున్నారు.

'పారా లీగల్ వలంటీర్ల పాత్ర గురుతరమైనది'



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర

జయపురం: గ్రామీణ ప్రజలకు న్యాయ సేవా ప్రదీకరణ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించడంలో పారా లీగల్ వలంటీర్ల పాత్ర గురుతరమైనదని కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షుడు, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర అన్నారు. జయపురం జిల్లా కోర్టు ఆవరణలోని ఏడీఆర్ సభాగృహంలో పారా లీగల్ వలంటీర్ల శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మిశ్రా మాట్లాడుతూ.. న్యాయ సహాయత పొందలేని వ్యక్తుల వద్దకు వెళ్లి, వారికి న్యాయ సహాయం చేకూర్చే బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్లు, కోర్టులు, ఆస్పత్రుల్లో పారా లీగల్ వలంటీర్ల పాత్రపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు న్యాయం చేకూర్చేందుకు ప్రతీ గ్రామంలో లీగల్ క్లినిక్ ఏర్పాటు చేయాలని, ప్రతీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాది హరిష్ ముదులి ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయవాదులను సమకూర్చడం తదితరుల విషయాలు వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మందికి పైగా పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

బరంపురం: నగరంలో ఎండలు తీవ్రతరం అవుతుండడంతో పలు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా బరంపురం ఎన్టీఆర్ సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర్ మెయిన్ రోడ్డులో ఉచితంగా మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

యజమానులకు నగలు అందజేత



బాధితులకు రికవరీ సొత్తు అందజేస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక ప్రసాదరావు పేటలోని ఎ.రాహుల్ పాత్రో ఇంట్లో బంగారు నగలు, డబ్బు దొంగతనానికి గురైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 29వ తేదీన జరిగిన ఈ దొంగతనంలో విలువైన బంగారు నగలతో పాటు ఒక రూ.లక్ష నగదు దొంగలు దోచుకుపోయారు. ఈ కేసుని దర్యాప్తు చేసిన జయపురం పట్టణ పోలీసులు ముగ్గురు నిందితులతో పాటు బంగారం కొన్న వ్యాపారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ బంగారాన్ని బాధితులైన ఎ.రాహుల్ పాత్రో, అతడి భార్యకు ఆదివారం సాయంత్రం పట్టణ పోలీసు అధికారి రమణి రంజన్ దొళాయి అందజేశారు.

బొరిగుమ్మలో బీజేడీ ప్రచారం

జయపురం:

కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గంలోని జయపురం అసెంబ్లీ పరిధి బొరిగుమ్మలో బీజేడీ అభ్యర్థులు ప్రచారానికి సోమవారం శ్రీకారం చుట్టారు. కొరాపుట్ ఎంపీ అభ్యర్థి కౌశల్య కులసిక, జయపురం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఇందిర నందోలు భారీ ర్యాలీతో ప్రచారం చేపట్టారు. బైక్ ర్యాలీతో బల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వందలాదిమంది బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు ప్రజలను కలుసుకొని తమకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రబినారాయణ నందో, బొరిగుమ్మ బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు వివేకానంద పట్నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మున్న దొర, సీనియర్ నేత ఎ.నాగరాజు దొర, నారాయణరావు, గుప్త గంతాయిత్, సుభాష్ నాయిక్, సురేంద్ర త్రిపాఠీ, చిత్రసేన మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీజేడీ అభ్యర్థులు

భవిష్యత్‌లో తేలికపాటి కాంక్రీట్‌తో నిర్మాణాలు

- పర్యావరణ పరిరక్షణకు చర్యలు
- అభిప్రాయాలు వెల్లడించిన నిపుణులు
- ఐఐటీ క్యాంపస్‌లో ప్రత్యేక వర్క్‌షాపు



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న డాక్టర్ ఎస్.సి.పాల్

భువనేశ్వర్: భవిష్యత్‌లో తేలికపాటి కాంక్రీటు (ఎల్‌డబ్ల్యూఏ)తో దృఢమైన కట్టడాలు నిర్మాణమవుతాయని నిపుణులు పేర్కొన్నారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ)లో తేలికపాటి కాంక్రీట్ అభివృద్ధి, కార్యాచరణ శీర్షికతో ప్రత్యేక వర్క్‌షాపు సోమవారం నిర్వహించారు. ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో అల్లాయ్స్ (ఇంఫా), ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఐ)ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మన్నిక కలిగి సుస్థిరమైన పర్యావరణ అనుకూల నిర్మాణ శైలి బాగోగులపై పారిశ్రామిక, విద్యాసంస్థల నిపుణులు చర్చించారు. స్థానిక ఐఐటీ స్కూల్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎస్ఐఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు భవిష్యత్ నిర్మాణాల అంశంపై వివరణాత్మక చర్చలను విశ్లేషించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణ విభాగం ఓఎస్డీ డాక్టర్ ఎస్.సి.పాల్ మాట్లాడుతూ.. ప్రత్యేకమైన తేలికపాటి కాంక్రీటు ఉత్పత్తి రంగంలో పరిశోధనపై తన అనుభవాన్ని పంచుకున్నారు. ఈ విధానం భావి నిర్మాణ రంగాల్లో అద్భుతమైన ఫలితాలు ఆవిష్కరిస్తుందన్నారు. ప్రస్తుత కాంక్రీటు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగాలు ఉత్పత్తి చేయగలిగే తేలికపాటి కాంక్రీటు (ఎల్‌డబ్ల్యూఏ) ఉపయోగించడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీటు వేడిమి రహితం, ధ్వని నియంత్రిత, అగ్నిమాపక భద్రత, భవనంపై అధిక భారం తొలగింపునకు సంబంధించిన అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ఈ కాంక్రీటుతో నిర్మిత భవనాలు బలంగా దీర్ఘకాలిక మన్నికతో పర్యావరణ అనుకూలతో నమ్మకపూర్వకమైన స్థిరత్వానికి దోహదపడుతుందని గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీటుకు సంబంధించిన మిశ్రమ డిజైన్ అంశాలపై ప్రయోజిత పరిశోధన, పారిశ్రామిక సంప్రదింపుల సంస్థ (ఎస్ఆర్ఐసీ) డీన్ ప్రొఫెసర్ దినకర్ పస్లా సుదీర్ఘంగా చర్చించారు.

వేగవంతమైన నిర్మాణానికి అధునాతన శైలి

ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్.ఎస్.సూర్య ప్రకాష్ నిర్మాణాత్మక ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీట్ ప్రీకాస్ట్ స్లాబ్‌లను ఉపయోగించి సరసమైన గృహాల భవిష్యత్తు గురించి సవివరంగా చర్చించారు. వేగవంతమైన నిర్మాణానికి ఈ అధునాత శైలి భారతదేశంలో నేడు కీలకమైన అవసరంగా పేర్కొన్నారు. చిత్త రంజన్ రే, హోల్ టైమ్ డైరెక్టర్, ఇంఫా లిమిటెడ్, దేబాశిష్ మహాపాత్రో, డీజీఎం మాట్లాడుతూ తమ కార్ఖానాలో ఎల్‌డబ్ల్యూఏ ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. వేదాంత లిమిటెడ్ (అల్యూమినియం) పరిశోధన, అభివృద్ధి చీఫ్ ఆఫీసర్ డాక్టర్ అమిత్ ఛటర్జీ ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీటు కోసం డిజైన్ విధానాలపై ప్రసంగించారు. డాల్మియా భారత్ గ్రూప్ టెక్నికల్ సర్వీసెస్ హెడ్ డా.మణికందన్ ప్యాలెటైజేషన్ ప్రక్రియను ఉపయోగించి ఎల్‌డబ్ల్యూఏ ఉత్పత్తికి సంబంధించిన పారామెట్రిక్ అధ్యయనాన్ని సమర్పించారు. స్థానిక ఐఐటీ స్కూల్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హెడ్ డాక్టర్ సుమంత హల్దార్ మాట్లాడుతూ వర్ధమాన పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఎల్‌డబ్ల్యూఏ అంశంపై వర్కుషాపు జ్ఞానోదయం కలిగించే దిశలో నేటి తరం విద్యార్థులకు దోహదపడుతుందని నిర్వాహక బృందాన్ని అభినందించారు. పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు ఇతరేతర అనుబంధ వర్గాల చర్చ ఆధారంగా ప్రత్యేక సభ్య బృందం భారతదేశంలో ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీటు కోసం భవిష్యత్ ప్రణాళిక, కార్యాచరణ (రోడ్ మ్యాప్) సమర్పించింది. ఒడిశా వంటి ఖనిజాలు అధికంగా ఉన్న రాష్ట్రాలు అటువంటి వనరుల నుంచి ఎల్‌డబ్ల్యూఏ ప్రయోజనం వివరాల్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌డబ్ల్యూఏ కాంక్రీటు యొక్క ప్రయోగశాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ఉత్పాదన పని సామర్థ్యం, ఇతర తాజా లక్షణాల యొక్క ఆచరణాత్మక అనుభవాలను ఈ ప్రదర్శనలో తెలియజేయడం విశేషం. ఈ వర్క్‌షాప్‌లో పరిశ్రమలు, విద్యాసంస్థలు మరియు ప్రభుత్వ సంస్థల నుండి 70 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

28న సివిల్ సర్వీస్ పరీక్షలపై యువతకు అవగాహన

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ఎస్సార్ కన్వెన్షన్‌లో ఈ నెల 28న సివిల్ సరీ్వసెస్ పరీక్షలపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఫౌండేషన్ స్థాపించి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామని అన్నారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతకు నైపుణ్యశిక్షణ, మెరిట్ సాధించే పేద బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం లక్ష్యంగా ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 8మంది మెరిట్ విద్యార్థులకు ఢిల్లీలోని నెక్స్ట్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ అందించామని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, వివిధ రంగాలలో ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

హిందీ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం



కరపత్రం విడుదల చేస్తున్న హిందీ మంచ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ద్వారా ఉత్తరాంధ్రా జిల్లాలో జాతీయ భాష హిందీ ప్రచారం చేసేందుకు హిందీ ప్రచార (పరీక్ష) కేంద్రాలను ప్రారంభించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు సి.ఎల్.నాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనె శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, హిందీ పట్టభద్రులు, నిరుద్యోగులు, హిందీ భాషాభిమానులు ఎవరైనా పరీక్షా కేంద్రాలను నెలకొల్పవచ్చని తెలిపారు. అనకాపల్లి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ పాడేరు, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో కేంద్రాలను ప్రారంభించడానికి దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ప్రచార కార్యదర్శి 94412 46591 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాస్తున్న పీజీ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సంబంధించి వర్సిటీ పరీక్ష కేంద్రంలో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ మూడు, ఐదేళ్ల డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్, లా నుంచి 383 మంది, సైన్స్ కోర్సుల నుంచి 314 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య పరిశీలించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: రౌతుపురం–నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైను ట్రాక్‌పై పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుంది. పలాస వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న రైలు నుంచి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో జారి పడటంతో 108 అంబులెన్స్‌లో టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

బావిలోకి దూకి వృద్ధుడు ఆత్మహత్య

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని శివనగర్ కాలనీ కనవమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న బావిలోకి దూకి రేసు లక్ష్మణరావు(65) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నామని చెప్పారు. సోమవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఆత్మహత్యగా భావించి కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

బీజేడీ ఏడో జాబితా విడుదల

- 6 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు
- ఐదుగురు కొత్తవారికి అవకాశం





భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ సోమవారం త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు అభ్యర్థుల 7వ జాబితాను వీడియో సందేశం ద్వారా విడుదల చేశారు. హిందోల్ నుంచి ఢెంకనాల్ సిట్టింగ్ ఎంపీ మహేశ్ సాహు, రఘునాథ్‌పల్లి నుంచి అర్చనరేఖ బెహెరా, బలికుదా – ఎరసమా నుంచి శారదా ప్రసన్న జెనా, బంగిరిపొషి నుంచి రంజితా మరాండి, బొరి నుంచి బిశ్వరంజన్ మల్లిక్‌లను బీజేడీ బరిలోకి దించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే తుషార కాంతి బెహెరాను కాకత్‌పూర్ నుంచి మళ్లీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించడం విశేషం.

సిట్టింగులకు నిరుత్సాహం

తాజా జాబితాలో బీజేడీ 5 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను నిరుత్సాహపరచింది. అభ్యర్థుల జాబితాలో వీరికి స్థానం కల్పించలేదు. వీరిలో సుదామ్ మరాండి (బంగిరిపొషి), సుబ్రత్ తొరాయ్ (రఘునాథ్‌పల్లి), సీమారాణి నాయక్ (హిందోల్), రఘునందన్ దాస్ (బలికుద– ఎరసమా), సునంద దాస్ (బొరి) ఉన్నారు. అయితే బంగిరిపొషిలో సుదాం మరాండి స్థానంలో ఆయన భార్య రంజిత మరాండి ఖరారయ్యారు. అలాగే రఘునాథపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే సుబ్రత్ తారాయ్ బదులుగా ఆయన భార్య అర్చనరేఖ బెహరాని అభ్యర్థిగా ప్రకటించారు.

వలస అభ్యర్థులకు పట్టం

గత ఎన్నికల్లో పరాజయం చవిచూసి పార్టీలు ఫిరాయించి బీజేడీలో చేరినవారికి తాజా జాబితాలో స్థానం కల్పించడం విశేషం. 2014 ఎన్నికల్లో బలికుద – ఎరసమా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూసిన శారదా ప్రసన్న జెనా 2019 ఏప్రిల్‌లో బీజేడీలో చేరారు. బిశ్వరంజన్ మల్లిక్ 4,062 ఓట్ల స్వల్ప తేడాతో 2019 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే సునందా దాస్ చేతిలో ఓడిపోయిన తర్వాత బీజేపీని విడిచిపెట్టి 2021లో ప్రాంతీయ పార్టీ బీజేడీలో చేరారు. వీరివురు పరాజితులైన విజేతకు పక్కలో బల్లెం వంటి బలమైన పోటీనివ్వడం ప్రామాణికంగా పరిగణించి వలస నేపథ్యంలో అందలం ఎక్కించడం చర్చనీయాంశం అయింది. బీజేడీ తాజా జాబితాతో 147 అసెంబ్లీ స్థానాల్లో 141, మొత్తం 21 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం పూర్తయ్యింది. మరో 6 శాసనసభ స్థానాలకు మాత్రమే అభ్యర్థుల్ని ఖరారు చేసి జాబితా విడుదల చేయాల్సి ఉంది. వీటిలో ఖండపడా నియోజకవర్గం అభ్యర్థిత్వంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. మిగిలిన ఆరు స్థానాల్లో ఖండపడా, బెగుణియా, ఖుర్దా, భొగరాయ్, నీలగిరి మరియు కొరేయ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

మహిళలకు ప్రాధాన్యం

బీజేడీ 5 కొత్త ముఖాలతో 6 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ జాబితాలో ఇద్దరు మహిళా అభ్యర్థులు ఉన్నారు. దీంతో మొత్తం 34 మంది మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులను బీజేడీ ఇప్పటివరకు ప్రకటించినట్లు అయ్యింది. ఈ లెక్కన శాసనసభ ప్రాతినిధ్యానికి 24 శాతం మహిళలకు ప్రాధాన్యత కల్పించగా, లోక్‌సభకు 33 శాతం (మూడింట ఒక వంతు) మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది.

నేటితో ముగియనున్న చైత్రోత్సవాలు



పురోహితులకు సన్మానం



ఆదివాసీ వాయిద్యాలు



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు



అమ్మవారికి భోగాల సమర్పణ

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పురోహితులకు ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ నిర్వహించింది. పూజల కోసం గంజాం జిల్లా కవిసూర్యనగర్ నుంచి రప్పించిన పురోహితులకు పసుపు నీళ్లతో ఆరాధించి సన్మానించారు. ఐదు రోజుల పాటుగా చండీపఠనం చేయడంతో పాటు చండీ హోమాన్ని నిర్వహించిన సందర్భంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వి.శ్రీనివాస్‌రావు, పెద్దిన వాసుల దంపతులు పురోహితులకు దక్షిణ, తాంబూలాలు సమర్పించారు.

ఆదివాసీ డప్పుల మధ్య...

అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన ఆదివాసీ డప్పుల మధ్య ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను ముస్తాబు చేస్తారు. దీనినే సింగారంగా పిలుస్తుంటారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే భక్తుల దర్శనం కోసం ఘటాలను సిద్ధం చేస్తారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు ఈ ఘటాలను దర్శించుకుని మామిడి, అరటి తదితర పండ్లతో పాటు అమ్మవారికి ప్రీతికరమైన భోగాలను సమర్పిస్తారు.

పూర్ణాహుతితో ముగింపు

ఐదు రోజుల పాటుగా జరిగే ఉత్సవాలు మంగళవారంతో ముగుస్తాయి. చండీహోమం పూర్ణాహుతితో కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటాయి. అనంతరం అమ్మవారి సేవకులు మల్లెలు (అగ్గి)పై నడక, ముళ్ల ఊయలలో ఊగుట వంటి ప్రధాన ఘట్టాలు ఉంటాయి. దీనిని వీక్షించేందుకు భక్తులు, పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



ముత్యాలమ్మవారు



పసుపు, వేప కొమ్మలతో కూడిన కలశాలు తీసుకొస్తున్న మహిళలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ముత్యాలమ్మ జాతర ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. వంశధార నదీ తీరంలో పూజలు నిర్వహించి శుద్ధ జలాలను తీసుకొచ్చి, అమ్మవారి ప్రాంగణాన్ని శుద్ధి చేయడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. ముత్తైదువులు పసుపు నీళ్లలో వేపాకులను తీసుకువచ్చి నగర పరిక్రమణ చేసిన అనంతరం అమ్మవారికి ఆ నీటితో అభిషేకాలు చేశారు. మూడు రోజుల పాటుగా జరిగే ఈ జాతర మంగళవారంతో ముగుస్తుంది. గత 25 సంవత్సరాలుగా ఈ జాతర ఇక్కడ నిర్వహిస్తుండడంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు జాతరను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. పంచామృత అభిషేకం, ధ్వజస్తంభం స్థాపన తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి.



వంశధార నది వద్ద పూజలు

సీపీఐ అభ్యర్థుల జాబితా విడుదల

- 1 లోక్‌సభ, 11 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

భువనేశ్వర్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) సోమవారం రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభయ్ సాహు ఈ విషయం వెల్లడించారు. ఒక లోక్‌సభ స్థానం , 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు ప్రకటించారు. జగత్‌సింగ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి రమేష్ చంద్ర సెఠిని ప్రతిపాదించింది. 11 అసెంబ్లీ స్థానాలకు సీపీఐ అభ్యర్థుల వివరాలు.

అభ్యర్థి	నియోజకవర్గం
గురునాథ్ ప్రధాన్	ఛత్రపురం
రాజేంద్ర నాయక్	సుందర్‌గడ్
అభిజిత్ సాహు	బలికుద ఎరసమా
రమేష్ చంద్ర త్రిపాఠి	బ్రజ్‌రాజ్‌నగర్
జిన్మయీ సహాని	పారాదీప్
ప్రబిన్ దాస్	కవిసూర్యనగర్
అజయ్ పట్నాయక్	నీలగిరి
శంకర్షణ్ బారిక్	భువనేశ్వర్ (ఉత్తర)
మనోజ్ పరిడా	నిమాపడా
కుమార్ జానీ	లక్ష్మీపూర్
పాండవ్ భొయ్	కంటాబంజి

మనస్థాపంతో యువకుడు మృతి

హిరమండలం: తన కుమారుడు మృతికి ఇద్దరు వ్యక్తులు కారణమంటూ హిరమండలం రెల్లి వీధికి చెందిన కళింగపట్నం భూలోకం స్థానిక పోలీస్‌స్టేషన్‌లోసోమవారం ఫిర్యాదుచేశారు. వివరాల్లోకి వెళ్తే.. రెల్లివీధికి చెందిన కళింగపట్నం ధనుంజయరావు (26) అదే ప్రాంతానికి చెందిన పందిరి రాజా వద్ద గత నెల రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొంత సొమ్మును తీర్చగా..మిగిలిన సొమ్ము ఇవ్వాలని ఈ నెల 10న అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో రాజాకు మద్దతుగా అతని స్నేహితుడు మిన్నారావు నిలిచాడు. స్థానికులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. మరుసటి మరోసారి వాగ్వాదానికి దిగడంతో మనస్తాపానికి గురైన ధనుంజయరావు గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ నెల 20న సీతాపురంలో ఉన్న సోదరి అనారోగ్యానికి గురికావడంతో పరామర్శించేందుకు వెళ్లగా పరిస్థితి విషమించడంతో సోమవారం మళ్లీ రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేశారు. సుభలాయి వద్దకు చేరేసరికి మృతిచెందాడు. స్థానిక ఎస్సై జి.నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్. పక్కనే కాయల వెంకటరెడ్డి తదితరులు

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర టెక్కలిలో ముగుస్తున్న సందర్భంగా సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం టెక్కలిలో నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, సర్పంచ్ జి.సుజాత, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు కె.అజయ్, కె.సతీష్, ఎస్.సత్యరాజ్, టి.పాల్గుణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు సత్తారు సత్యం, కె.గోవింద్, నాయకులు ఆర్.మల్లయ్య, పి.రమేష్, జి.గురునాథ్‌యాదవ్, ఎస్.హేమసుందర్‌రాజు, ధవళ కృష్ణ, పి.హేమలత, ఎస్.మోహన్, వి.శ్రీధర్‌రెడ్డి, ఆర్.జయమోహన్, ఆర్.మురళీరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న నెక్కంటి

రాయగడ: క్రీడాకారులు ఒక లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని బీజేడీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో రాయగడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర సాధనతో క్రీడాకారులు తమ లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ క్రీడారంగానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు.

ప్రతీ క్రీడాకారుడు ఇటువంటి తరహా పోటీల్లో పాల్గొంటే అవకాశాలు లభిస్తాయన్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 10 టీములు పాల్గొనగా, బజరంగీ బాయ్స్ జట్టు విజయాన్ని సాధించింది. రన్నర్‌గా లియో లెజెండ్, మూడో స్థానంలో కలింగసేన జట్లు నిలిచాయి. విజేతలకు నెక్కంటి ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేశారు.

పరీక్ష ఫెయిలయ్యానని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న జానకి అలియాస్ గాయత్రి

కోటబొమ్మాళి: మండలం, విశ్వనాథపురం పంచాయతీ, సీతారాంపురం గ్రామానికి చెందిన వజ్రగడ్డి జానకి అలియాస్ గాయత్రి (16) సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. టెన్త్ క్లాస్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

సీతారాంపురానికి చెందిన వజ్రగడ్డి సరోజనమ్మ, రామారావు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రామారావు ఏడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. పెద్ద కుమార్తె మంజులత డిగ్రీ చదువుతోంది. రెండో కుమార్తె జానకి నందిగాం గురుకుల పాఠశాలలో చదువుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. జానకి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. గ్రామంలో వారు కొత్తగా నిర్మించిన ఇంటికి వెళ్లి వస్తానని తల్లి సరోజనమ్మకు చెప్పింది. కొంతసేపటికి జానకి స్నేహితులు వచ్చి జానకి ఎక్కడుందని తల్లిని అడుగగా, కొత్త ఇంటి వద్ద ఉందని బదులిచ్చింది. దీంతో స్నేహితులు వెళ్లి చూస్తే విద్యార్థిని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు తల్లికి సమాచారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే జానకి మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

వెల్లువలా చేరికలు



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన లావేటిపాలెం గ్రామస్తులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన పేర్లవానిపేట మత్స్యకారులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రం బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. సోమవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో 19వ డివిజన్ ఇన్‌చార్జి బిర్లంగి మోహన్‌రావు, గొప్పు సంతోష్ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, సంజీవరావు, కృష్ణారావు, దుర్గాప్రసాద్, మురళీమోహన్, గోవిందరావు, ధర్మారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో లావేటిపాలెం గ్రామానికి చెందిన 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమకు బీజేపీ నాయకులు బలవంతంగా కండువా వేశారని చెప్పారు. తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో లావేరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గార మండలం పేర్లవానిపేటకు చెందిన పలువురు మత్స్యకారులు పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ చీకటి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేర్ల శ్రీరాములు, కుందు పోలయ్య, పేర్ల రాంబాబు, చీకటి శ్రీరామమూర్తి, సూరాడ సూర్యం, ఫల్గుణరావు, కోనాడ నర్సింగరావు, మైలపల్లి పోలీసు తదితరుల పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని ఆకాశలక్కవరం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన 19వ డివిజన్ కార్యకర్తలు



సంతబొమ్మాళి: పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పేరాడ తిలక్, కాయల వెంకటరెడ్డి

పుడమి తల్లిని పరిరక్షిద్దాం



ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా పొందూరు మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భూమి ఆకృతిలో కూర్చొని ప్రదర్శన చేశారు. మొక్కలు నాటడం ద్వారా భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో–ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు రావాడ పాపారావు, ధవళ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

– పొందూరు

సైకత హనుమాన్



హనుమాన్ జయంతి సందర్భంగా ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ సోమవారం వేసిన సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంటోంది. హనుమాన్‌కు సైకత రూపంలో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

– ఆమదాలవలస రూరల్

క్లుప్తంగా

ఎన్‌సీసీ అధికారుల ఎంపికకు ఆహ్వానం


సెంచూరియన్‌లో వీసీ పీకే మహంతితో మాట్లాడుతున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ గ్రూప్ అధికారులు సోమవారం పర్యటించారు. వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతిని మర్యాదపూర్వకంగా కలిసి అసోసియేట్ ఎన్‌సీసీ అధికారుల ఎంపికకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అరవింద్, కమాండింగ్ అధికారి కల్నల్ తపస్ మండల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీ కేర్ టేకర్లుగా పనిచేస్తున్న అధికారులకు అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులుగా ఎంపిక చేయాల్సి ఉందన్నారు. త్వరలో విశాఖలో జరగనున్న కార్యక్రమానికి రావాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన కాశీ (ఫైల్)

గజపతినగరం: మండల కేంద్రం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గజపతినగరానికి చెందిన ఆరిశెట్టి కాశీ(65) మెయిన్ రోడ్డు నుంచి స్కూటీపై ప్రయాణిస్తూ భైరిపురం రోడ్డు మలుపు వద్ద లోపలకు తిరుగుతున్న సమయంలో సాలూరు నుంచి విజయనగరం వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో కాశీ పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కాశీకి భార్య ప్రమీలతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ యు.మహేష్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియామకాలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీలో చేపట్టిన సంస్థాగత నియామకాల్లో భాగంగా వివిధ రాష్ట్ర కమిటీల్లో జిల్లాకు చెందిన నాయకులకు స్థానం దక్కింది. ఈ మేరకు ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామక జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీలో జోనల్ ఇన్‌చార్జ్‌గా యజ్జల బాలరాజును నియమించారు. అదేవిధంగా రాష్ట్ర ఎస్సీ సెల్ ఆఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా రేగాన శ్రీనివాసరావు, రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శిగా కొసర నారాయణ రావు, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా కంది శ్రీరాములు నియమితులయ్యారు.

ఆమిటిలో గడ్డివాములు దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న గడ్డివాములు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 9 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఈదుబిల్లి ఆదినారాయణ, మడక అప్పలనాయుడు, మరడాన అప్పలస్వామి, కృష్ణ, కరణం సింహాచలం, నాయుడులతో పాటు మరికొంత మంది రైతులకు చెందిన తొమ్మిది గడ్డి వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తమ పశువులకు ఏడాది పొడవునా మేత వేసేందుకు నిల్వ చేసుకున్న గడ్డివాములు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో గాలి పెద్దగా వీయడంతో మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తులు వెళ్లలేకపోయారు. అగ్ని ప్రమాదంలో గడ్డివాములు కాలిపోయిన విషయాన్ని రాజాం అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం అందించారు. రాజాం అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించారు.

శ్యామాయవలసలో..

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలసలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన మండల వెంకటరావు, మండల అప్పలనాయుడుకు చెందిన నాలుగు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. అలాగే అక్కడే గడ్డిమేస్తున్న మండల అప్పలనాయుడుకు చెందిన ఆవు కూడా ఈ అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో గాయాల పాలైంది. అయితే గడ్డివాములు అగ్ని ప్రమాదానికి గురైనట్టు రైతులు గమనించి మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ అప్పటికే గడ్డివాములు కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

- జేఎన్‌టీయూ-జీవీ యూనివర్సిటీలో ఓ ఉన్నతాధికారి అక్రమాల పరంపర
- విద్యార్థులకు కనీస సౌకర్యాల్లేకుండా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం
- ధర్నా చేసిన విద్యార్థుల గొంతు నొక్కేసిన వైనం
- విద్యార్థులకు మద్దతునిచ్చారనే సందేహంతో ప్రొఫెసర్లకు వేధింపులు
- ప్రభుత్వం రూ.కోట్ల నిధులిచ్చినా అభివృద్ధి పనుల మందగమనం
- ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసేలా అధికార దుర్వినియోగం

సరస్వతీ నిలయంలో... చీడపురుగు



జేఎన్‌టీయూ-జీవీ యూనివర్సిటీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విద్యలనగరం కీర్తికిరీటంలో కలికితురాయిలా వెలుగొందాల్సిన జేఎన్‌టీయూ-గురజాడ విజయనగరం (జీవీ)యూనివర్సిటీ ఓ ఉన్నతాధికారి ధోరణి వల్ల తిరోగమనంలోకి వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. సరస్వతీ నిలయంలో చీడపురుగులా మారారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతోనే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న సందేహాలు యూనివర్సిటీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. తన చేతగానితనాన్ని దాచిపెట్టి విద్యార్థులను, ప్రొఫెసర్లను ప్రభుత్వం పైకి రెచ్చగొట్టేలా అతని ధోరణి ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా 2007లో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుచేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. జేఎన్‌టీయూ-కాకినాడకు అనుబంధంగానే కొనసాగింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే మళ్లీ ఆ విద్యాలయాన్ని యూనివర్సిటీగా మార్పు చేశారు. అలా రెండేళ్ల క్రితం జేఎన్‌టీయూ-జీవీగా ఆవిర్భవించింది. గురజాడ అప్పారావు పేరునూ జగన్‌మోహన్‌రెడ్డి జోడించి ఉత్తరాంధ్ర ప్రతిష్టను ఇనుమడింపజేశారు. ఆ స్థాయికి తగ్గట్టే అన్ని వనరులూ సమకూర్చడానికి నిధులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరుచేసింది. కొత్త భవనాల నిర్మాణానికి జాతీయ ఇంజినీరింగ్ కౌన్సిల్ (ఏఐటీసీ), జేఎన్‌టీయూ-కాకినాడ నుంచి దాదాపు రూ.24.94 కోట్లు మేర విధులు వచ్చాయి. అకడమిక్ బ్లాక్-3 (అడ్మినిస్ట్రేషన్ బ్లాక్), బాలికల వసతిగృహం, మెటలర్జికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ భవనాల విస్తరణతో పాటు తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

నిర్మాణ పనుల మందగమనం...

జేఎన్‌టీయూ-జీవీ యూనివర్సిటీని తీర్చిదిద్దాల్సిన ఓ ఉన్నతాధికారి అధికార దుర్వినియోగం, పరిపాలనా రాహిత్యం ఇప్పుడు శాపంగా మారాయి. కొత్తగా తలపెట్టిన నిర్మాణ పనుల్లో ఇప్పటివరకూ బాలికల హాస్టల్ భవనం, మెటలర్జికల్ ఇంజినీరింగ్ ల్యాబ్, సివిల్ ఇంజినీరింగ్ ల్యాబ్ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మిగతా పనులను పూర్తి చేయాల్సిన గడువు కాలం అయిపోయినా పూర్తికాలేదు. నిధులున్నా సదరు ఉన్నతాధికారి నిర్వాకం ఫలితంగా పనులు మందగమనంలో ఉన్నాయి. కొన్ని పనులకు అడ్డదిడ్డంగా అంచనా వ్యయాన్ని పెంచుకుంటూపోతున్నారు. దీనివల్ల టెండర్ల ప్రక్రియ కొలిక్కిరావట్లేదు. వర్సిటీకి ఉన్నతాధికారి అయిన ఆయన ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఇలాంటి నిర్వాకాల వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటోంది.

మౌలిక సదుపాయాలపైనా నిర్లక్ష్యం...

యూనివర్సిటీ క్యాంపస్‌లో, హాస్టళ్లలో తగిన సౌకర్యాలు కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి ప్రభుత్వం నిధులిచ్చినా సదరు ఉన్నతాధికారి మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. క్యాంపస్‌లో లైటింగ్ వ్యవస్థ సరిగా లేదని, హాస్టల్ బాత్‌రూమ్‌ల నిర్వహణ బాగా లేదని, లైబ్రరీలో ఇంటర్నెట్ సౌకర్యం పునరుద్ధరించాలని విద్యార్థులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఆయన ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు. దీన్ని నిరసిస్తూ నాలుగు నెలల కిందట రోడ్డెక్కారు. రెండ్రోజుల నిరసనతో దిగొచ్చిన ఆ ఉన్నతాధికారి ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ఆ సమస్యల పరిష్కారం మాటెలా ఉన్నా ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులకు వేధింపులు తప్పలేదు. ల్యాబ్స్‌లో, థియరీ సబ్జెక్టుల్లో ఫెయిల్ చేయించి కక్ష తీర్చుకున్నారని వారు గగ్గోలు పెడుతున్నారు.

ప్రొఫెసర్లకు తప్పని వేధింపులు...

సమస్యలపై ఆందోళన చేసిన విద్యార్థులకు పరోక్షంగా మద్దతు ఇచ్చారనే అనుమానంతో పలువురు ప్రొఫెసర్లకు కూడా వేధింపులు తప్పలేదు. వీటిని భరించలేక ఓ ప్రొఫెసర్ ఏకంగా ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేస్తే, దాన్ని ఆమోదించకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. యూనివర్సిటీకి ఏదైనా రీసెర్చ్ ప్రాజెక్టు ప్రొఫెసర్ల ప్రతిభ, కృషి ఆధారంగా మంజూరవుతాయి. భారీ నిధులతో ఓ రీసెర్చ్ ప్రాజెక్టు ఓ ప్రొఫెసర్‌కు వస్తే జీర్ణించుకోలేని సదరు ఉన్నతాధికారి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. దీంతో ఆ ప్రాజెక్టు పరిస్థితి గాల్లో ఉంది. రీసెర్చ్ ప్రాజెక్టులు వస్తేనే యూనివర్సిటీకి పేరు వస్తుంది. నిధులు వస్తాయి. స్వలాభం తప్ప ఆ అధికారి ఇవేవీ పట్టించుకునే పరిస్థితిలో లేరు.

చెప్పినట్లు చేసేవారికి అందలం...

ఉన్నత పదవిలో నియమితులైన కొద్దిరోజులకే ఆ అధికారి అక్రమాలకు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా తాను చెప్పిన పనులు చేయడానికి ఇష్టపడని ఓ మహిళా ఎగ్జామ్స్ సెక్షన్ అధికారిని నాలుగు నెలలకే తొలగించేశారు. డెప్యుటేషన్‌పై డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఓ అధికారిని మాతృశాఖకు అప్పగించాలని పేరెంట్ యూనివర్సిటీ నుంచి ఇటీవల ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందే ఆయన్ను రిలీవ్ చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఈ విషయమై బాధిత అధికారి రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. సదరు ఉన్నతాధికారి తాను చెప్పినట్లు చేసేవారిని మాత్రం అందలం ఎక్కిస్తున్నారు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో ప్రమోషన్ ఇచ్చేశారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో మాత్రమే ఇలాంటి ప్రమోషన్లు ఇవ్వాలి. నిబంధనలకు విరుద్ధం కావడంతో ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఇచ్చిన ప్రమోషన్ కాస్త రద్దు చేయకతప్పలేదు. ఇలాంటి అసంబద్ధమైన నిర్ణయాలతో ఆ ఉన్నతాధికారి తన అసమర్థతను బయటపెట్టుకోవడమే గాక ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం


జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి నామినేషన్ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, పాల్గొన్న జిల్లా నేతలు

విజయనగరం అర్బన్: విజయనగరం పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో దిగిన బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి బెల్లాన చంద్రశేఖర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం రిటర్నింగ్ కార్యాలయం బయట ఉన్న మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బెల్లాన చంద్రశేఖర్ ఐదేళ్లు ఎంపీగా చేసిన ప్రజాసేవలు మళ్లీ గెలిపిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఎంపీ నిధులు జిల్లా అభివృద్ధికి వినియోగించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, రైల్వే అభివృద్ధి పనుల్లో ఎంపీగా కేంద్ర ప్రభుత్వాన్ని సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. మళ్లీ ఎంపీగా ఆయన వస్తేనే జిల్లాకు మంచిదనే ఆలోచనతో వై.ఎస్.జగన్‌హన్‌రెడ్డి ఆయనకు ఎంపీ టికెట్ ఇచ్చారని, జిల్లా వాసులు గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి వచ్చిన ఎంపీ అభివృద్ధి నిధులను జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు వెచ్చించానన్నారు. రైల్వే అండర్‌పాస్ రోడ్లు, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల పూర్తికి కృషిచేసినట్టు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వివిధ మండలాల ఎంపీటీసీలు, పార్టీ మండలాధ్యక్షులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు


పార్టీలో చేరిన కొట్టక్కి కార్యకర్తలతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీటీసీ సామిరెడ్డి చంద్రయ్య ఆధ్వర్యంలో కొట్టక్కి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, గొల్లలపూడి సీనియర్ నాయకుడు బాలి శంకరరావు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి సోమవారం ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి శంబంగి సాదరంగా ఆహ్వానించారు. కొట్టక్కి గ్రామానికి చెందిన ఇనుపచుప్పల శ్యామ్ ప్రకాష్, ఇనుపచుప్పల రాము, బగ్గ దిలీప్, గంటిపల్లి రమేష్, బొత్స దుర్గారావు, సోంబార్కి కిరణ్, బగ్గ శరబంద, గొల్లలపేటకు చెందిన మునకాల బాల, మునకాల గౌరు, మునకాల సత్తెమ్మ, మునకాల చినబాబు, భవాని, బాలి పున్నెమ్మ, మునకాల సత్యం, సన్యాశిరావు తదితరులు చేరిన వారిలో ఉన్నారు. రానున్న ఎన్నికలలో ఓటు ద్వారా జగనన్న రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు శంకుస్థాపన చేశా..

శృంగవరపుకోట: హైదరాబాద్‌కు తనే శంకుస్థాపన చేశానని, ఐటీ ఉద్యోగాలు కల్పించి ఇంటి వద్దనే ఉంటూ పనిచేసుకునే సదుపాయం కల్పిస్తానని, పాడువు నేర్పింది, గ్యాస్ ఇచ్చింది.. మరుగుదొడ్లు కట్టించినది తనేనంటూ చంద్రబాబు గొప్పలు చెప్పడంతో జనం నవ్వుకున్నారు. అధికారంలోకి వస్తే తను ఏమి చేస్తారన్నది స్పష్టంగా చెప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలకే అధిక సమయం వెచ్చించారు. ఎస్.కోటలోని దేవీకూడలిలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభకు జనం కరువయ్యారు. షెడ్యూల్ టైమ్‌కు ఎస్.కోట చేరుకున్నా జనంలేక ఆయన 40 నిమిషాలపాటు బస్సులోనే ఉండిపోవాల్సి వచ్చింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా పెరిగిపోయిందన్నారు. జాబు రావాలంటే బాబు రావాలన్నారు. స్కూల్‌కి రంగులేస్తే చదువులు రావంటూ ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలను ఏకరువు పెట్టారు. బొత్స తన రాజకీయం కోసం ఎస్.కోటను విశాఖలో చేర్చకుండా చేశాడని, అధికారంలోకి రాగానే ఎస్.కోటను విశాఖలో చేరుస్తానని చెప్పారు. పోలీస్ స్టేషన్ చూడని నాపై 22 కేసులు పెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి, ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు సీఎం అయిన ప్రతీసారి రాష్ట్రం కష్టాల్లోకి వెళ్లిపోతుందని ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ అనడంతో ప్రజలు అవాక్కయ్యారు.

మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్



మోడల్ పోలింగ్ స్టేషన్ నిర్వహణ ఏర్పాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ ప్రక్రియపై వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కలిగించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి సోమవారం ప్రారంభించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారుల స్థానాలు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏజెంట్ స్థానాలు, నమూనా ఈవీఎంలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎంపీ స్థానానికి ముగ్గురు, అసెంబ్లీకి 18 మంది నామినేషన్లు

విజయనగరం అర్బన్: విజయనగరం పార్లమెంట్ స్థానానికి ముగ్గురు, అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 18 మంది నామినేషన్లను దాఖలు చేశారు. ఎంపీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్, బెల్లాన వంశీకృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా సియ్యాదుల ఎల్లారావు నామినేషన్ వేశారు.

- విజయనగరం అసెంబ్లీ స్థానానికి అఖిల భారతీయ జనసంఘ్ పార్టీ తరఫున పోలిపల్లి కిరణ్‌కుమార్, సమాజ్‌వాదీ పార్టీ తరఫున పెనుమత్స కరుణాకర్, స్వతంత్ర్య అభ్యర్థిగా పడాల ఆదినారాయణ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.
- గజపతినగరం అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున జి.కూర్మినాయుడు, నవ భారత నిర్మాణ సేవా పార్టీ తరఫున గౌరినాయుడు నామినేషన్ వేశారు.
- ఎస్.కోట నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా వారాది చిరంజీవి, కొట్యాడ లోకాభిరామకోటి, కొట్యాడ రమాదేవి, భాస్కరభట్ల పుష్పలత, వైఎస్సార్‌సీపీ డమ్మీ అభ్యర్థిగా బి.అప్పలనాయుడు నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.
- నెల్లిమర్ల నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థిగా యెరుకొండ జేజారాణి, రీఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున అదపాక సూరిబాబు, సమాజ్‌వాదీ తరఫున కర్రి చిన్నారి, కర్రి కృష్ణ, జనసేన పార్టీ తరఫున లోకం నాగమాధవి ఒక సెట్ నామినేషన్ వేశారు.

పదో తరగతి ఫలితాల్లో.. బాలికలదే హవా

- 91.82 శాతంతో ఐదో స్థానంలో నిలిచిన విజయనగరం
- బాలికల ఉత్తీర్ణత శాతం 93.73, బాలురు 89.91 శాతం
- సత్తాచాటిన ప్రభుత్వ విద్యాలయాల విద్యార్థులు
- అత్యధిక మంది 500 పైబడి మార్కుల సాధన
- సర్కారు బడులకు చెందిన 76 మందికి 580-589 మధ్య మార్కులు


ఈశ్వర్ కార్తీక్


కె.జాహ్నవి


ఎం.వర్షిని


గుడివాడ సరస్వతి


ఇమంది తపస్విని


తరణి

విజయనగరం అర్బన్: పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలుర కంటే 3.82 శాతం అధికంగా బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 91.82 శాతం ఉత్తీర్ణతతో విజయనగరం జిల్లా రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 23,690 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 91.82 శాతంతో 21,752 మంది ఉత్తర్ణులయ్యారు. వీరిలో బాలికలు 11,822 మంది పరీక్షకు హాజరుకాగా 93.73 శాతంతో 11,081 మంది పాసయ్యారు. అలాగే, బాలురు 11,868 మందిలో 89.91 శాతంతో 10,671 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది పరీక్ష రాసిన 24,040 మందిలో 76.66 శాతంతో 18,430 మంది మాత్రమే ఉత్తీర్ణులై రాష్ట్రస్థాయిలో 7వ స్థానంలో జిల్లా నిలిచింది. 2021-22 ఏడాదిలో 77.50 శాతం ఉత్తీర్ణత తెచ్చుకొని జిల్లాకి రాష్ట్రస్థాయిలో 3వ స్థానం వచ్చింది.

అదరగొట్టిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు ఏడుగురు అత్యధికంగా 590 పైగా మార్కులు సాధించారు. వీరిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు నలుగురు, ఏపీ గురుకుల సొసైటీ స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. 580-589 మధ్య మార్కులు తెచ్చుకున్న వారు 79 మంది ఉన్నారు. వీరిలో జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు అత్యధికంగా 29 మంది, తరువాత వరుసలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 27 మంది నమోదయ్యారు.

సత్తా చాటిన ఆదర్శన పాఠశాల విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: పదో తరగతి ఫలితాల్లో కొండవెలగాడ, మొయిద, పారసాం, సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. సతివాడ ఆదర్శ పాఠశాలలో 93 మందిలో 590 పైగా మార్కులను ఇద్దరు, 560కు పైగా మార్కులను 20 మంది, 500కు పైగా మార్కులను 59 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన బొబ్బిలి గురుకుల విద్యార్థులు

బొబ్బిలి: పదోతరగతి ఫలితాల్లో బొబ్బిలి గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. 77 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 65 మంది విద్యార్థులు 550 దాటి మార్కులు సాధించారు. మిలినవారు 500-550 మధ్య మార్కులు సాధించారు. కె.వరుణ్-592, ఎ.హర్షవర్ధన్-591, కె.రాకేష్-590 మార్కులతో రాణించారు.


బొప్పడాం ఉన్నత పాఠశాలలో టాపర్లను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది


కె.వరుణ్


హర్షవర్ధన్


కె.రాకేష్



పదోతరగతి ఫలితాల్లో విజయసంకేతాన్ని చూపుతున్న పురిటిపెంట బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, హెచ్ఎమ్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు

మేనేజ్‌మెంట్ వారీగా ఉత్తీర్ణత శాతం ఇలా..

మేనేజ్‌మెంట్	బాలురు	బాలికలు	మొత్తం
ఏపీ మోడల్ స్కూల్	98.16	99.22	98.73
ఏపీఆర్ఈఐ స్కూల్స్	98.23	100	98.97
ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ	92.09	95.87	94.52
బీసీ వెల్ఫేర్ స్కూల్స్	99.07	100	99.51
కేజీబీవీఎస్	----	96.29	96.29
ఎంపీపీ-జెడ్పీ	87.04	91.67	89.30
మున్సిపల్	70.00	76.45	72.45
ప్రైవేట్ ఎయిడెడ్	----	85.00	85.00
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	97.41	98.76	97.98
స్టేట్ గవర్నమెంట్	73.26	86.54	80.65
టీడబ్ల్యు స్కూల్స్	86.96	100	91.82
మొత్తం	89.1	93.73	91.82

జిల్లా స్థాయి టాప్ టెన్ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, పాఠశాలలు:

పాఠశాల	విద్యార్థి పేరు	మార్కులు
ఏపీ మోడల్ స్కూల్, సతివాడ	గంప ఈశ్వర కార్తీక్	594
ఏపీ మోడల్ స్కూల్, కొత్తవలస	మారోతు హేమవర్షిణి	592
ఏపీ గురుకుల పాఠశాల, బొబ్బిలి	కొట్టాపు వరుణ్	592
ఏపీ మోడల్ స్కూల్, సతివాడ	కొంకి జాహ్నవి	592
ఏపీ గురుకుల పాఠశాల, బొబ్బిలి	మజ్జి హర్షవర్ధన్	591
ఏపీ మోడల్ స్కూల్, సతివాడ	మీసాల తేజశ్వని	591
జెడ్పీహెచ్ఎస్, బొప్పడాం	చేపూరు దుర్గదీశిత	591
ఏపీ గురుకుల పాఠశాల, బొబ్బిలి	కర్రోతు రాకేష్	590
బీసీ వెల్ఫేర్ స్కూల్, నరవ	గోపిశెట్టి తరుణ్	589
ఏపీ మోడల్ స్కూల్, గర్భాం	గుడివాడ సరస్వతి	589
జెడ్పీహెచ్ఎస్, బొండపల్లి	పూడిత యామిని	589
జెడ్పీహెచ్ఎస్, కుమరాం	విజ్జపు యశ్విత	589
ఏపీ మోడల్ స్కూల్ భోగాపురం	లంక భవాని	588
ఏపీ గురుకుల పాఠశాల, బొబ్బిలి	లగుడు జితిన్‌సాయి	588
ఏపీమోడల్ స్కూల్, మరుపల్లి	ఇమంది తపశ్విని	588